క్లుప్తంగా

శివాలయానికి రూ.లక్ష వితరణ

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయం అభివృద్ధి కోసం బెంగళూరులో ఉంటున్న పద్మజ, ఎంఎస్ శంకర్ దంపతులు రూ.లక్ష చెక్కును ఉదారంగా అందజేసి స్వామి భక్తిని చాటుకున్నట్లు ఆలయ సేవకులు సనగరం పట్టాభి రామయ్య తెలిపారు. సోమవారం ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో జరిగే అన్న ప్రసాద వితరణ కోసం అమెరికాలో స్థిరపడిన శివ భక్తుడు మడకశిర వెంకటేష్ రూ.5 వేల నగదును అందజేసినట్లు సేవకులు తెలిపారు.

రసవత్తరంగా సంఘమిత్ర ఎంపిక

కురబలకోట: మండలంలోని కనసానివారిపల్లె వీఓ వెలుగు సంఘమిత్ర (యానిమేటర్) ఎంపిక సోమవారం రసవత్తరంగా జరిగింది. తీవ్ర పోటీ నెలకొంది. అంతర్గతంగా రాజకీయాలు కూడా చోటు చేసుకున్నాయి. నాయనవారిపల్లె గుడి వద్ద వీఓ సమావేశం నిర్వహించారు. సంఘమిత్ర నియామకం కోసం నల్గురు మహిళలు పోటీ పడగా చివరకు ముగ్గురు బరిలో నిలిచారు. తొలుత చేతులు ఎత్తడం ద్వారా ఎంపిక చేయదలిచారు. విబేధాలు తలెత్తుతాయని ఇందుకు గ్రూపు లీడర్లు సమ్మతించలేదు. ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటామని తెలిపారు. దీంతో స్లిప్‌లో పేరు రాయడం ద్వారా సంఘమిత్రను ఎన్నుకున్నారు. ఒక్క ఓటు మెజారిటీతో కనసానివారిపల్లె కాలనీకి చెందిన అరుణ ఎంపికయ్యారు. దీంతో ఈమెను సంఘమిత్రగా నియమిస్తున్నట్లు వెలుగు అధికారులు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

కేవీపల్లె : మండలంలో 2025–26 విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో పి. రెడ్డిబాషా అన్నారు. సోమవారం మండలంలోని గర్నిమిట్టలో ఇంటింటి ప్రచారం చేశారు.

కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె సిటీ: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు సోమవారం స్థానిక వాసవీభవన్‌వీధిలోని అమ్మవారి ఆలయంలో ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతం, గణపతిపూజ, స్వస్తివాచనం జరిగింది. సాయంత్రం శ్రీ వాసవీ సహస్రనామ పారాయణం,అమ్మవారి జీవితగీతం, కుంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉలవల గంగమ్మకు పూజలు

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీలో ఉన్న శ్రీ ఉలవల గంగమ్మ జాతరలో భాగంగా రెండోరోజు సోమవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం భాగవతారిణి గంగావతిచే హరికథా కాలక్షేపం చేపట్టారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భయ్యారెడ్డిగారిపల్లెకు చెందిన వి. శ్రీనివాసులురెడ్డి, ఎం. రాజశేఖర్‌రెడ్డి, శివారెడ్డి సుమారు రెండువేల మందికి అన్నదానం నిర్వహించారు. రాత్రి ఆసాది కథ, భజనలు, చాందిని బండ్లు, కోలాటాలు నిర్వహించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సీఐ యుగంధర్

పీలేరు రూరల్ : వేసవి దృష్ట్యా అసాంఘిక కార్యకలాపాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ యుగంధర్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో దొంగతనాలు జరుగే ప్రమాదం ఉందన్నారు. ఊర్లకు వెళ్లేవారు, విహార యాత్రలకు వెళ్లేవారు ముందస్తుకు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన ఇళ్లపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. నేరాలు అరికట్టడమే లక్ష్యంగా పీలేరు పట్టణంలో సుమారు 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

త్రీమెన్ కమిటీ విచారణ

కలికిరి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులచే పనులు చేయించిన ఘటనపై జిల్లా విద్యాధికారికి అందిన ఫిర్యాదు మేరకు డీఈఓ ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఫిర్యాదుదారు ఉపాధ్యాయుడు దేవీ ప్రసాద్‌లను వేర్వేరుగా విచారించారు. మరికొందరు ఉపాధ్యాయులు స్వచ్ఛంగా త్రీమెన్ కమిటీ సభ్యుల ముందు హాజరై తమ స్టేట్‌మెంట్‌లు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అలాగే పాఠశాల పేరెంట్స్ కమిటీ కూడా పాఠశాల ఘటనపై కమిటీకి వినతిపత్రం అందజేశారు. వివరాలను నమోదు చేసుకున్న కమిటీ నివేదికను డీఈఓకు పంపనున్నట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు కలికిరి, బి.కొత్తకోట, కురబలకోట ఎంఈఓలు పాల్గొన్నారు.

దారికి కంచె వేశారని ఫిర్యాదు

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ పంచాయతీ నక్కల దళితవాడ నుంచి పాఠశాలకు వెళ్లే దారికి అడ్డుగా కంచె వేశారని దళిత సంఘాల నాయకుడు ముల్లంగి చంద్రయ్య గ్రామస్తులతో కలసి తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు.

వేసవిలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్

- విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు
- రూ.1.50 కోట్లతో సబ్ స్టేషన్ ఆధునికీకరణ
- ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం


సీటీఎంరోడ్ సబ్‌స్టేషన్‌లో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఈఈ గంగాధరం

మదనపల్లె : వేసవిలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ మదనపల్లె డివిజన్ ఈఈ గంగాధరం తెలిపారు. సీటీఎంరోడ్ 33/11 కే.వి.సబ్ స్టేషన్‌లో రూ.కోటి వ్యయంతో ఏర్పాటుచేస్తున్న 8 ఎంవీఏ. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈఈ గంగాధరం మాట్లాడుతూ...వేసవిలో విద్యుత్ వాడకం పెరిగిపోవడంతో సరఫరాలో తరచూ అంతరాయాలు కలుగుతున్నాయన్నారు. దీన్ని నివారించేందుకు సీటీఎం రోడ్ సబ్‌స్టేషన్‌లో గతంలో ఉన్నటువంటి 8ఎంవీఏ, 5 ఎంవీఏ పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో....5 ఎంవీఏను తొలగించి 8 ఎంవీఏ నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి కెపాసిటీ పెంచుతున్నామన్నారు. ఏర్పాటుకు సంబంధించి పదిరోజుల పాటు విద్యుత్ సరఫరాలో అప్పుడప్పుడూ అంతరాయం కలగవచ్చని, వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే సీటీఎంరోడ్ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేసి 70 సంవత్సరాలు అవుతోందని, ట్రాన్స్‌ఫార్మర్‌ల కింది మ్యాట్ డ్యామేజీ కావడంతో రీప్లేస్ చేయడంతో పాటు, ఫిల్లింగ్, ఇంటర్నల్ ఫెన్సింగ్ తదితర పనులకు సంబంధించి రూ.50లక్షల నిధులతో మరమ్మతు పనులు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం సీటీఎం సబ్‌స్టేషన్‌లో ఏర్పాటుచేస్తున్న రూ.కోటి విలువైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్, రూ.50లక్షలతో మరమ్మతు పనులు మొత్తం కలిపి రూ.1.5 కోట్లతో ఆధునికీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ హరికుమార్, ఏఈ అజయ్‌బాబు, టౌన్ ఏఈ ముజమ్మిల్, ఈస్ట్ ఏఈ కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలి

బాస్ జెండా ఆవిష్కరణ సభలో శివప్రసాద్


పనసమాకులపల్లెలో బాస్ జెండా ఆవిష్కరించిన పీటీఎం.శివప్రసాద్

మదనపల్లె : మత ఉగ్రవాదం కంటే కుల ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరమని, కఠిన చర్యలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మదనపల్లి రూరల్ మండలంలోని పనసమాకులపల్లెలో ఎస్సీ కాలనీ నక్క నాగరాజు ఆధ్వర్యంలో, బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న అధ్యక్షతన సోమవారం బాస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ గ్రామస్తులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ కుల వివక్ష తొలగిపోలేదని, కుల ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయన్నారు. కొన్ని చోట్ల పాలకులే కుల ఉగ్రవాదుల్ని తయారు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు వీలైనంత త్వరగా కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, లేకుంటే దేశంలో కులాల మధ్య యుద్ధం తప్పదని హెచ్చరించారు. వ్యవసాయం చేసే ప్రతి దళిత కుటుంబానికి భూమి పంచాలని, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, బ్యాంకులు అందించే రుణాల్లో 15 శాతం ఎస్సీలకు, 7 శాతం ఎస్టీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాస్ నాయకులు నీరుగట్టి రమణ, టి.ఎ. పీర్ బాషా, మలారి గిరిబాబు, వీసీకే నాయకులు వై. గంగాధర్, సొన్నికంటి రెడ్డెప్ప రెడ్డిప్రసాద్, జి.వి. రమణ, వై. చిన్నా, సురేష్, రవిశంకర్, కాంతమ్మ, రెడ్డెమ్మ, సుకన్య, హరినాథ్, నరసింహులు, కృష్ణప్ప, సుబ్రహ్మణ్యం, మిట్టమర్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్‌లో మార్పులు చేయాలి

– లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్ల వినతి


మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం సమర్పిస్తున్న లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ సభ్యులు

మదనపల్లె : భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్–2025లో కొద్దిపాటి మార్పులుచేసి ప్రజలకు మరింత చేరువ చేయాలని మదనపల్లె అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలను కలిసి సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్–2025లో చేయాల్సిన మార్పులపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మహేంద్రబాబు మాట్లాడుతూ...భవన నిర్మాణ అనుమతులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్‌ను తాము సమర్థిస్తున్నామన్నారు. అయితే ఈ విధానాన్ని భవననిర్మాణ అనుమతుల కోసం వచ్చిన స్థల యజమానులకు వివరిస్తే..వారు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. మూడునెలలుగా ఈ విషయంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందులో కొన్ని మార్పులు చేసినట్లయితే...ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే చేయాల్సిన మార్పులపై రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ మంత్రి నారాయణను కలిసి వివరించామన్నారు. 300 చదరపుమీటర్లలోపు స్థలాలకు సంబంధించి భవననిర్మాణ అనుమతుల విషయంలో ప్లింత్ లెవెల్ ఇన్స్‌పెక్షన్ రిపోర్ట్ బాధ్యతల నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లను తొలగించి, బాధ్యతలను టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలకు అప్పగించాలన్నారు. చట్టపరిమితులకు లోబడి మరింత సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌ను అనుమతించాలన్నారు. ప్లాన్ అనుమతి కోసం సమర్పించే దస్తావేజుల్లో కోర్టులోని న్యాయపరమైన వివాదాలను దాచిపెట్టి అర్జీదారుడు అనుమతి పొందితే, దానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను బాధ్యులు చేయవద్దన్నారు. లైసెన్స్‌డ్ సర్టిఫికేషన్ స్కీమ్–2025కు సంబంధించి మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో దళారీలు అనే పదాన్ని తొలగించి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల ప్రాముఖ్యతను స్పష్టంగా తెలపాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రభాకరనాయుడు, సెక్రటరీ రెడ్డినాగరాజ, వైస్ ప్రెసిడెంట్ జాకీర్‌హుస్సేన్, ట్రెజరర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: స్థానిక స్త్రీ శక్తి భవనంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు, రైతు మహిళా సంఘాల సభ్యులకు పీఎండీఎస్, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై మండల ఏవో ప్రేమలత, ఎంటీ రఘునాథ్, ఏపీఎం హరి, సుబ్బరాం, మల్లమ్మ, పవన్‌లు పలు సూచనలిచ్చారు. ప్రకృతి సేద్యం వల్ల కలిగే లాభాలు, అదే విధంగా సేంద్రీయ ఎరువుల వాడకం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

మదనపల్లె : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌సెంటర్‌లో వెబ్ డెవలపర్ కోర్సు కొత్త బ్యాచ్ బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.ఓబులేషు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ,యువకుల కోసం స్కిల్ హబ్‌సెంటర్ ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ ఆపై చదివి ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్ డెవలపర్ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. కోర్సు కాలపరిమితి 3 నుంచి 4 నెలలు ఉంటుందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జీఎంఆర్ పాలిటెక్నిక్ స్కిల్‌హబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు నైపుణ్యాభివృద్ధి కోఆర్డినేటర్ నవీన్‌ను 9553202509 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

170 మందికి ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్‌లు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థినులు 170 మందికి న్యూఢిల్లీ ఏఐసీటీఈ మెరిట్ స్కాలర్ షిప్‌లు లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ సోమవారం తెలిపారు. ఆర్థికంగా వెనుక బడిన విద్యార్థినులకు ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ పేరుతో చేయూతనిచ్చి చదువుల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రూ.85 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వీరిని కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్‌చౌదరి అభినందించారు.

వీఆర్‌ఏలకు పదోన్నతులు

మదనపల్లె : ఉమ్మడి చిత్తూరుజిల్లా మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్హత కలిగిన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించినట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో అర్హత కలిగిన 20 మంది వీఆర్‌ఏలలో...15 మందిని ఆఫీస్ సబార్డినేట్, 5 మందికి వాచ్‌మెన్‌లుగా పదోన్నతులు కల్పించామన్నారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన వీఆర్‌ఏలు...సబ్ కలెక్టర్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

మదనపల్లె : సమాచార హక్కు చట్టం–2005కు సంబంధించి సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా విజయవాడ ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు కమిషనర్ ఆదేశించిన నేపథ్యంలో పట్టణంలోని వార్డు సచివాలయాలన్నింటిలో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. సమాచార హక్కు చట్టం ఆవశ్యకతను తెలుపుతూ, సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సోమవారం అమ్మచెరువుమిట్ట, వైఎస్సార్ నగర్, ముజీబ్‌నగర్, శివాజీనగర్, రామారావుకాలనీ, ఎస్‌బీఐ కాలనీ, గొల్లపల్లెరోడ్డు సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించామన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి పౌరుడికి సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం లాంటిదన్నారు. సమాచార హక్కు చట్టం సామాన్యుడికి, అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వశాఖ నుంచి కావాల్సిన సమాచారాన్ని తీసుకోవచ్చన్నారు. అయితే ఏ వ్యక్తి కూడా గోప్యత కలిగిన అంశాలను అడగరాదన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కనీస వేతన బోర్డును తక్షణమే నియమించాలి

– సబ్ కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ నాయకులు

మదనపల్లె : ఆకాశాన్ని అంటుతున్న ధరలు, విద్య వైద్యం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 35వేలు అమలు చేయాలని, రాష్ట్రంలో కనీస వేతన బోర్డును నియమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక కుటుంబం గౌరవ ప్రదంగా జీవించాలంటే నెలకు కనీసం రూ35,000లు అవసరమన్నారు. అందుకు అనుగుణంగా జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికసంఘాలతో సంప్రదింపులు జరిపి, కనీస వేతనాలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనేక రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో 12 మాసాలకు పైగా వేతనాలు చెల్లింపులు బకాయి పెట్టారని, వేతన బకాయిలన్నిటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లి మున్సిపాలిటీలో డైలీ వేజెస్ పారిశుధ్య కార్మికులకు నాలుగునెలలుగా వేతనాలు చెల్లించలేదని, ఇలాగైతే వారు ఎలా బతకాలని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు దేవా, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, ఉపాధ్యక్షుడు వాసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇంద్రాణి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లాహుస్సేనీ

గుర్రంకొండ: ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లాహుస్సేని అన్నారు. సోమవారం గుర్రంకొండలో ఆయన పర్యటించి పలువుర్ని ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున తమపెద్దలు అక్కడకు చేరుకొని ఆయన దుశ్శాలవులు, పూలమాలలతొ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడప పెద్ద దర్గావారి ఆధ్వర్యంలో కలిచెర్లలో నిర్వహించే గంధం ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు సికిందర్, గుల్జార్, అబ్రార్, కాలేషా, కమాల్‌ఖాన్, నజీమ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు. వేదపండితులు బాలాజీ,అమర వేదమంత్రోచ్చారణలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం మూలవర్లు, ఉత్సవ విగ్రహాలకు తిరుమంజనసేవ నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేనుడు ఆరాధన జరిగింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వేసవి పురస్కరించుకుని భక్తుల కోసం చలువ పందిళ్లు వేశారు. మంగళవారం నుంచి స్వామి వాహనాల్లో భక్తులకు దర్శనం కల్పిస్తారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యుల ప్రసాద్‌రెడ్డి, గంగారపు భాస్కర్‌రెడ్డి, సాయిచిత్ర భాస్కర్ నాయుడు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కుట్టు మిషన్లు పెద్ద స్కామ్


మాట్లాడుతున్న సాంబశివ

కురబలకోట: చంద్రబాబు స్కీములన్నీ స్కాములేనని వైఎస్సార్ సీపీ అన్నమయ్య బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సాంబశివ ఆరోపించారు. సోమవారం ఆయన మండలంలోని అంగళ్లులో విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పేదొకటి ఆతర్వాత చేసేదొకటిగా మారిందన్నారు. బలహీన వర్గాల మహిళలను అడ్డు పెట్టుకుని వారికి కుట్టు మిషన్ల పేరుతో ఏకంగా రూ.245 కోట్లు కొట్టేయడానికి స్కెచ్ వేశారన్నారు. బాబు ఏ పథకం తీసుకు వచ్చినా దాని వెనుక స్కాం దాగి ఉంటుందన్నారు. టెండర్ నుండి శిక్షణ వరకు దోపిడికి వీలుగా పథకం పన్నారన్నారు. అంతేగాకుండా కుట్టు మిషన్లు బ్రాండ్ ఇమేజ్ ఉన్నవి కాకుండా గుజరాత్‌లో తయారైన వాటిని అంటగట్టాలని చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం భారీ అవినీతికి తెరతీసిందన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి ఆధ్వర్యంలో బీసీల తరపున జిల్లాలో పోరాటాలకు దిగుతామన్నారు. రెడ్డిశేఖర్ నాయుడు, నారాయణ, చెన్నకేశవ, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రాయితీ పశుదాణా పంపిణీ

నిమ్మనపల్లె : ఎస్సీ ఎస్టీ పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పశుదాణా పంపిణీ చేశారు. సోమవారం స్థానిక పశువైద్య శాలలో టీడీపీ మండలాధ్యక్షుడు పుర్రా వెంకటరమణ, మల్లప్ప, రెడ్డెప్ప రెడ్డి, రాజన్నలతో కలసి వెటర్నరీ అధికారి సురేష్ రైతులకు దాణా అందజేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ...వేసవి కాలంలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం పాడి రైతులకు సబ్సిడీపై పశుదాణా అందిస్తోందన్నారు. మండలానికి మొదటి విడతగా 250 బస్తాలు వచ్చాయన్నారు. మండలంలోని నిమ్మనపల్లి, తవళం, కొండయ్యగారి పల్లె, సామకోటివారి పల్లె పంచాయతీలకు చెందిన ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు రూ.1110 విలువగల 50 కిలోల బస్తా 50 శాతం రాయితీపై రూ.555 లకు అందిస్తున్నామన్నారు. అవసరమైన రైతులు పశు వైద్యశాలలో గాని, రైతు సేవా కేంద్రంలో గాని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సుధాకర, లక్ష్మన్న, ఖాసింఖాన్, పశు వైద్య సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 77 రద్దు చేయకుండా ఐసెట్ నిర్వహిస్తే అడ్డుకుంటాం

మదనపల్లె సిటీ: పీజీ చదవాలనుకునే పేద విద్యార్థులకు గుదిబండగా మారిన జీవో 77ను రద్దు చేసి ఆ తరువాత ఈ ఏడాది ఐసెట్‌ను నిర్వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాయిప్రకాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం తన పాదయాత్రలో మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీఓ నంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. నగర కార్యదర్శి కిషోర్, మోహన్‌రాజ్, పురుషోత్తం, గిరీష్ పాల్గొన్నారు.

ఏనుగు మల్లమ్మకు ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండకు వెళ్లే మార్గమధ్యంలో వెలసిన శ్రీ ఏనుగుమల్లమ్మ ఆలయంలో సోమవారం మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పూజారి శేఖర్, విజయకుమారి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. దేవస్థానం తరపున ఈఓ మునిరాజ భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కర్నాటక, అనంతపురం, వైఎస్సార్ కడపజిల్లాల నుంచి భక్తులు మల్లయ్యకొండకు రావడం విశేషం.

ఆర్టీసీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సబ్ కలెక్టర్‌కు ఉద్యోగుల వినతి


సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు సమస్యలు వివరిస్తున్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(ఏపీపీటీడీ) నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను కోరారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు సెంట్రల్ కమిటీ నిర్ణయం మేరకు.. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆరునెలలుగా సిబ్బంది సమస్యలను డిపో, జిల్లా,జోనల్, రాష్ట్రస్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోగా, కక్ష సాధింపుచర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీపీటీడీ వైస్‌చైర్మన్, ఎండీ...ఉద్యోగులకు పనిష్మెంటుకు సంబంధించి ఇచ్చిన 01/2019 సర్క్యులర్‌ను మదనపల్లె డిపోల్లో అమలయ్యేలా చూడాలన్నారు. సిబ్బంది అనారోగ్యకారణాలతో సిక్ అయిన సందర్భంలో సెంట్రల్ ఆఫీస్ సర్క్యులర్‌నెం. ఈ1/468(జీఈఎస్)/2024 ..31/1/2024ను డిపోలో అమలుజరపాలన్నారు. డిపోలో సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ, వివిధ కారణాలతో డ్యూటీలు లేవని బలవంతంగా లీవులు వేయకుండా సెంట్రల్ ఆఫీస్ ఇచ్చిన సర్క్యులర్‌ను అమలుచేయాలన్నారు. గ్యారేజీ సిబ్బంది సరిపడా లేకపోగా, వారికి కావాల్సిన కనీస అవసరాలైన స్పేర్స్, టూల్స్ సప్లై చేయకుండా, పనిగంటలకు మించి పనిచేయించడంపై కేంద్ర కార్యాలయం సర్క్యులర్‌కు భిన్నంగా చర్యలు తీసుకోవడంను నిలుపుదల చేయాలని మనవి చేశారు. డిపోల్లో రెస్ట్ రూమ్స్, టాయిలెట్ వసతులు కల్పించాలని కోరారు. ఆర్టీసీలో రిటైర్ అయిన సిబ్బందికి కనీస పెన్షన్ లేని స్థితిలో ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పెన్షన్ అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, కే.పి.రంగా, ఏ.దేవరాజు, చెన్నై రెడ్డెప్ప, రెడ్డిబాషా, సీఎస్.రాజు, ఖలీల్, బీఎల్.ప్రసాద్, చిరంజీవి, జవహర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పీలేరు : ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పీఎస్ఎం. రాజు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సోమవారం స్థానిక తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావుకు ఎన్ఎంయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సెలవులపై గత ఏడాది జారీ చేసిన సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. డ్యూటీలో ఉన్న ఉద్యోగులకు బలవంతంగా సెలవులు వేయరాదని తెలిపారు. రిటైర్డ్ సిబ్బందికి ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పెన్షన్ అమలు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఆన్ కాల్ డ్రయివర్లకు కనీస వేతనాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు మధుసూదన్, ఆర్.బి.కె. నాయక్, సి.వి. రమణ, ఆదినారాయణ, మహేశ్వర, ప్రతాప్, శ్రీరాములు, శివశంకర్, నాగరాజ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.